క్లుప్తంగా

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం అల్లూర్తి, ఆర్‌వైపాళెం, సాయంత్రం అంకుపల్లి, వెంకటాపురం, పర్వతాపురం, పులికల్లు, వావింటపర్తి, ఊసపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా సూచించారు.

నేడు శ్రీరామ నవమి వేడుకలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని దేవస్థానం నిర్వాహకులు మంగళవారం వెల్లడించారు. ఉదయం ప్రత్యేక పూజలు, పారాయణం, సాయంత్రం సీతారాములు కల్యాణం, రాత్రి భక్తులకు అన్నప్రసాద వినియోగం ఉంటుందని పేర్కొన్నారు. శిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు, ఉదయం సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని బాబామందిర సేవా సమితి సొసైటీ పేర్కొంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

విద్యార్థినులకు అభినందన



మనుబోలు : మనుబోలు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మంచి ప్రతిభ కనపరిచి మండలంలో మొదటి స్థానంలో నిలిచిన ఇద్దరు విద్యార్థినులను హెచ్‌ఎం వసంతకుమారి, అధ్యాపకులు మంగళవారం అభినందించారు. ఎంపీసీలో 401 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన చల్లా చరిష్మా, సీఈసీలో 343 మార్కులతో మొదటి స్థానం సాధించిన పాలెపు గ్రీష్మలను సన్మానించి అభినందించారు.

రూ.లక్ష నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు : ఎన్నికల నేపథ్యంలో మనుబోలు కోదండరామపురం వద్ద హైవేపై తనిఖీలు నిర్వహిస్తుండగా ఎటువంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.లక్ష నగదును మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని నాయుడుపల్లికి చెందిన పలుచూరు రత్నయ్య బిల్లులు లేకుండా నగదును తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అజయ్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

గోపాలమిత్రపై సస్పెన్షన్ వేటు

కోవూరు : ఇందుకూరుపేట మండలం కొరుటూరు గోపాలమిత్ర జయకుమార్‌ను ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ జయకుమార్ ఓ యూట్యూబ్ చానల్‌లో రాజకీయ పార్టీల గురించి మాట్లాడారు. దీనిపై కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఎన్నికల నియమావళి కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గోపాలమిత్ర జయకుమార్‌ను విధుల నుంచి తొలగించాలని పశుసంవర్ధక శాఖ అధికారి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రైతులకు అండగా శాస్త్రవేత్తలు

నెల్లూరు(సెంట్రల్): రైతులకు శాస్త్రవేత్తలు అండగా ఉంటూ సూచనలు, సలహాలను అందిస్తుంటారని వ్యవసాయ పరిశోధన స్థాన సంచాలకులు ప్రశాంతి పేర్కొన్నారు. నగరంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో సమావేశాన్ని రెండో రోజు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏయే పంటలను అధికంగా వేస్తారు.. నీటి వనరులెలా ఉన్నాయి.. నీరు సమృద్ధిగా లేని ప్రాంతాల్లో ఏ పంటలను సాగు చేయాలనే అంశాలపై గ్రామాలకు శాస్త్రవేత్తలు వెళ్లి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం రైతుల నుంచి వినతులను స్వీకరించారు. నెల్లూరు ప్రధాన శాస్త్రవేత్త వినీత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీరామకథా తరంగిణి సప్తాహం

నెల్లూరు(బృందావనం): రేబాలవారివీధిలోని పీటీజీ టవర్స్‌లో పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామకథా తరంగిణి సప్తాహం మంగళవారం ఆరో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా యుద్ధ కాండంపై శతావధాని కొండపి మురళీకృష్ణ ఉపన్యసించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

బెడిసికొడుతున్న టీడీపీ మైండ్‌గేమ్

- ఫేక్ చేరికలతో కాలం వెళ్లదీస్తున్న సోమిరెడ్డి
- బలవంతంగా చేరిన వారు తిరిగి వైఎస్సార్‌సీపీలోకి..
- తలలు పట్టుకుంటున్న తమ్ముళ్లు



వెంకటాచలం మండలంలో..



ముత్తుకూరు మండలంలో..

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పెద్ద ఎత్తున ప్రజాధరణ ఉందనే భ్రమలు కల్పించేందుకు సోమిరెడ్డి చేస్తున్న మైండ్‌గేమ్ పూర్తిస్థాయిలో బెడిసికొడుతోంది. భారీగా టీడీపీలో చేరికలంటూ సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ప్రచారాలకు.. వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉంది. నిజానికి ఇప్పటి వరకు మండల స్థాయి నాయకుడెవరూ టీడీపీలో చేరిన దాఖలాలు లేవు. అనేక ప్రలోభాలకు గురిచేసి కొందరిని సోమిరెడ్డి కార్యాలయం వద్దకు తీసుకెళ్లి టీడీపీ కండువాలు కప్పుతున్నారు. ఇష్టం లేని వారు బలవంతంగా చేరినా తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వచ్చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఇదే తంతు జరుగుతున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

బలంగా వైఎస్సార్‌సీపీ

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉంది. ఇప్పటి వరకు టీడీపీలోకి వెళ్లిన వారి జాబితాను పరిశీలిస్తే ఒక్కరూ కూడా పట్టుమని పది ఓట్లు ఉన్న వారూ లేరు. గ్రామాల్లో రకరకాల సమస్యలు, ప్రలోభాల వల్ల కొందరు టీడీపీ కండువాలు వేయించుకుంటున్నా వారు గతంలో టీడీపీకు చెందిన వారే కావడం విశేషం. తొలి నుంచి వైఎస్సార్‌సీపీని నమ్ముకుని పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తున్న కార్యకర్తలు, నాయకులు ఏ ఒక్కరూ వెళ్లిన దాఖలాలు లేవు. దీనికితోడు కొందరు టీడీపీ నాయకులు కాలనీల్లో ఉన్న వారికి డబ్బుల ఆశ చూపి తీసుకుని వెళుతున్నారు. కొందరైతే ఎందుకు, ఎక్కడికి వెళ్తున్నది కూడా తెలియకుండా వాహనాలు ఎక్కుతున్నట్లు తెలుస్తోంది. ఇంత దారుణమైన పరిస్థితులు నియోజకవర్గంలో టీడీపీకి ఉన్నా అప్పుడే విజయం సాధించినట్లు మెజారిటీలు కూడా ప్రకటిస్తుండడంపై జనాలు నవ్వుకుంటున్నారు.

సొంత పార్టీ వారికే కండువాలు

ఎన్నికల నియమావళి అమలవుతున్న నాటి నుంచి సర్వేపల్లి నియోజకవర్గంలో వింత రాజకీయం నడుస్తోంది. టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి సొంతపార్టీ వారినే అధిక సంఖ్యలో చేర్చుకుంటున్నారు. నలుగురు ఇతర పార్టీల నుంచి చేరితే అందులో సొంత పార్టీ వారు పది మందిని కలిపి కండువాలు వేసి మొత్తం 14 మంది చేరినట్లు లెక్కకట్టి ఫొటోలు పెట్టుకుంటున్నారు. ఆయా గ్రామాలకు చెందిన వారు వాస్తవాలు గ్రహించి అపహాస్యం చేస్తున్నారు. వెంకటాచలం మండలంలో సొంత పార్టీకి చెందిన సర్పంచ్‌కు కండువా వేయడం, ముందు రోజు టీడీపీలో చేరి తర్వాత రోజు పొరపాటైందని వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు, కార్యకర్తల వైనం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలాంటి బలవంతపు చేరికలను ప్రోత్సహిస్తున్న సోమిరెడ్డి తీరును ప్రజలు ఎండగడుతున్నారు. పొదలకూరు శ్రీహరి కాలనీకి చెందిన సుమారు 20 కుటుంబాల వారికి బలవంతంగా టీడీపీ కండువాలు వేశారు. మరుసటి రోజు వారు మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. మండలంలోని బిరదవోలులో కేవలం 40 కుటుంబాల వారు టీడీపీలో చేరితే 200 కుటుంబాల వారు చేరినట్లు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. ఇందులో కూడా కొందరు వైఎస్సార్‌సీపీలోకి వచ్చేశారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



పొదలకూరు : రాజీనామాలు అందజేసిన వలంటీర్లు



ముత్తుకూరు : రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి సచివాలయం బిట్-1 పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు మంగళవారం సామూహిక రాజీనామాలు చేశారు. తమ రాజీనామా లేఖలను పంచాయతీ సెక్రటరీకి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తామంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా ఉండేందుకు రాజీనామా చేసినట్లు తెలిపారు.

బ్రహ్మదేవిలో..

ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవి సచివాలయం-1, 2 పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖలను స్థానిక సచివాలయంలో సిబ్బందికి అందజేశారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌ఈఓ పి.దయాసాగర్ అన్నారు. పట్టణంలోని సెబ్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా భద్రపరచాలని సూచించారు.

అనంతరం మాట్లాడుతూ మద్యం అక్రమ విక్రయాలపై సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ యశోధరదేవి, సబ్ ఇన్‌స్పెక్టర్ రవి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్‌ఈఓ దయాసాగర్

దోచుకోవడమే సోమిరెడ్డి నైజం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : అందినకాడికి దోచుకోవడం.. దాచుకోవడమే సోమిరెడ్డి నైజం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వడ్లపూడి, గొట్లపాళెం, లింగారెడ్డిపల్లి, రాజోలుపాడు, నాయుడుపల్లి, వీరంపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా సర్వేపల్లిని తిరుపతి జిల్లాలో కలిపే పరిస్థితి వస్తే ముఖ్యమంత్రిని ఒప్పించి నెల్లూరు జిల్లాలోనే కొనసాగేలా చేశానన్నారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని, అందువల్లే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీకు మేలు జరిగిందని భావిస్తేనే ఓటు వేయండి అని ధైర్యంగా అడుగుతున్నట్లు చెప్పారు. నేను, సోమిరెడ్డి ఇద్దరం వ్యవసాయ శాఖ మంత్రులుగా పనిచేశామని అయితే సోమిరెడ్డికి నోట్లు, ఓట్ల యావే తప్ప రైతుల గోడు పట్టదన్నారు. టీడీపీ హయాంలో మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నట్టేట ముంచాడన్నారు. ఇతర జిల్లాల నుంచి మిల్లర్లను రానివ్వకుండా రకరకాల సాకులతో అడ్డుకున్నాడని ఆరోపించారు. దీంతో జిల్లాలో ఉన్న మిల్లర్లు కుమ్మక్కై తక్కువ ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారని తెలిపారు. ఇందుకు గానూ సోమిరెడ్డికి రూ.50 కోట్ల ముడుపులు ముట్టాయన్నారు. అందువల్లే గతంలో ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రజలు ఆలోచించి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు కాకాణికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, శ్రీహరిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



గజమాలతో కాకాణికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



విడవలూరు: మహిళకు నమస్కరిస్తున్న రజత్‌కుమార్‌రెడ్డి



ఇందుకూరుపేట : మహిళను పలుకరిస్తున్న గీతారెడ్డి

విడవలూరు : గడిచిన ఐదేళ్లలో ప్రజలకు అనేక రకాల సంక్షేమ పథకాలు అందాయని, అందుకే సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని దంపూరు పంచాయతీలో ఆయన మంగళవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని, ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. అందుకే వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. అనంతరం రాజీనామా చేసిన వలంటీర్లు మాట్లాడుతూ గడిచిన 58 నెలల కాలంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని, అందుకే తమ ఉద్యోగానికి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పనిచేస్తున్నట్లు వెల్లడించారు. కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రాహిన్‌రెడ్డి, సర్పంచ్ ఇనగంటి సురేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు నాగేంద్ర, శ్రీను, శీనయ్య, శివ, శీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి

ఇందుకూరుపేట : రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి కోరారు. మండలంలోని సోమరాజుపల్లి గ్రామంలో వారు మంగళవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి కరపత్రాలు అందజేసి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సంక్షేమ పాలన పునరావృతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ బీవీ రమణయ్య, పార్టీ నేతలు జలీల్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : కరపత్రం అందజేస్తున్న పూజారెడ్డి

శ్రీరామునికి కళా వందనం

మనుబోలు: శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము మంగళవారం బొటనివేలి గోరుపై శ్రీరాముని ప్రతిమను తయారు చేసి అబ్బురపరిచాడు. రాము తయారు చేసిన పలు సూక్ష్మ కళారూపాలు గతంలో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకున్నాయి.



మనుబోలు : బొటనివేలి గోరుపై శ్రీరాముడు

- ముత్తుకూరు : శ్రీరామ నవమి సందర్భంగా ఓ ఉపాధ్యాయుడు మర్రి ఆకుపై శ్రీరాముడి బొమ్మను రూపొందించారు. మండలంలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మరత్నం శ్రీరాముని చిత్రాన్ని ఆవిష్కరించారు.



ముత్తుకూరు : మర్రి ఆకుపై శ్రీరాముడు

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకిసేవ గావించారు.



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

శివపార్వతులకు వసంతోత్సవం

మనుబోలు : మండల కేంద్రంలోని సంగమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివ పార్వతులకు వసంతోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలో అర్చకుడు ఫణీంద్రశర్మ వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి దంపతులకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం శివ పార్వతులను ఎడ్ల బండిపై ఉంచి గ్రామోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు వసంతం (పసుపు, సున్నం కలిపిన నీటిని) దేవునిపై పోయిడం ఆనవాయితీ. చిన్నారులు, యువతులు ఒకరిపై ఒకరు వసంతాలు చల్లుకుని కేరింతలు కొట్టారు. అంతకు ముందు సోమవారం రాత్రి నూతన దంపతులకు పారువేట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.



ఎడ్ల బండిపై స్వామి దంపతులు

అగ్ని ప్రమాదాలపై మహిళలకు అవగాహన

పొదలకూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పొదలకూరు ఫైర్‌స్టేషన్ అధికారి వరకుమార్ పట్టణంలోని నివాస ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంట గ్యాస్ సిలిండర్ల వినియోగం, గ్యాస్ వల్ల కలిగే అగ్నిప్రమాదాలను వివరించారు. వంట చేసే సందర్భంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వంట సిలిండర్ నుంచి గ్యాస్ లీకై నా, మంటలు వ్యాపించినా వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వారికి ప్రమాదాలు-జాగ్రత్తలపై కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఎస్‌ఈఐఎల్‌లో భద్రతకు పెద్దపీట

తోటపల్లిగూడూరు : ప్రపంచ స్థాయి భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయడంలో ఎస్‌ఈఐఎల్ రోల్ మోడల్‌గా నిలిచిందని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు అన్నారు. మండలంలోని అనంతపురంలో ఉన్న ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సీల్) కార్యాలయంలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ కంపెనీ విజయానికి అత్యంత ప్రధానమైన భద్రత విషయంలో ఎస్‌ఈఐఎల్ ప్రత్యేక శ్రద్ధ చూపడం హర్షణీయమన్నారు. అనంతరం భద్రత ప్రమాణాల విషయంలో నిబద్ధత ప్రదర్శించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో కంపెనీ సీఈఓ శ్రీరాఘవ్ త్రివేది, ఓఅండ్ఎం హెడ్ సునీల్‌కుమార్ గుప్తా, హెచ్ఎస్ఈ హెడ్ పవన్‌కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా..



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్న



కొరుటూరుకు చెందిన వారితో ఎమ్మెల్యే ప్రసన్న

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు, కొరుటూరు గ్రామాల్లో రాజీనామా చేసిన వలంటీర్లు వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పనిచేస్తామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. నెల్లూరులోని ప్రసన్న నివాసంలో ఈ మేరకు వారు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీ అందించేలా కృషిచేయాలని కోరారు. పేదలకు న్యాయం జరిగేలా వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వారు ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు భీమవరపు వెంకట కృష్ణారెడ్డి, షేక్.షబ్బీర్, పామంజి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 200 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

వెంకటాచలం : మండలంలోని కంటేపల్లి గ్రామంలో 200 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరు నెల్లూరు నగరంలోని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లలో తమ గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో తామంతా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు మంత్రి కాకాణికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి కాకాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కంటేపల్లి గ్రామంలో 200 కుటుంబాలు టీడీపీకి గుడ్ బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరడంతో ఆ గ్రామంలో టీడీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు.